
andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
బుధవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 29.6 ; కనిష్ఠం 24.4
నిర్మల్ జిల్లా వార్తలు
8
గురువారం 1 ఆగస్టు 2024



సీజనల్ వ్యాధులతో ఆసుపత్రిలో కిక్కిరిసిన రోగులు



ఓపీ విభాగం వద్ద బారులు తీరిన రోగులు

భైంసా, జూలై 31 : డివిజన్ పరిధిలో సీజనల్ వ్యాధుల బెడద అధికమయ్యింది. వర్షాల జోరు, వాతావరణంలోని మార్పులతో అన్ని ప్రాంతాల్లో వ్యాధుల బారిన పడుతున్న సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. ఈ క్రమంలో సీజనల్ వ్యాధుల బాధితులు చికిత్స కోసం భైంసాలోని ఏరియా ఆసుపత్రికి అధిక మొత్తంలో తరలివస్తున్నారు. ఉదయం నుంచి ఇక్కడి ఓపీ విభాగాల వద్ద బారులు తీరుతున్నారు. వ్యాధుల బాధితులు అధికంగా ఉంటుండటంతో ఏరియా ఆసుపత్రిలో మూడు కౌంటర్లను ఏర్పాటు చేసి రిజిస్ట్రేషన్ నిర్వహిస్తున్నారు. ఇది వరకు ఇక్కడి ఆసుపత్రిలో ఓపీ విభాగంలో రోజు 350 నుంచి 400 మంది వరకు రోగులు చికిత్సలు పొందేవారు. ప్రస్తుతం వ్యాధుల బెడద అధికంగా ఉండటంతో గత పది రోజులుగా రోజు సరాసరి 675 మందికి పైగా రోగులు ఓపీ విభాగంలో చికిత్సలు పొందుతున్నారు. దీంతో ఆరోగ్య పరీక్షలు నిర్వహించి చికిత్సలు అందించే ఓపీ బ్లాక్‌ల వద్ద రోగులు తోసుకునే పరిస్థితులు నెలకొన్నాయి.

జిల్లాకు చేరిన ఏకరూప దుస్తుల వస్త్రం

నిర్మల్ కల్చరల్, జూలై 31 : పాఠశాల విద్యార్థులకు సంబంధించిన రెండవ జత ఏకరూప దుస్తుల వస్త్రం బుధవారం జిల్లా కేంద్రానికి చేరినట్లు డీఈవో రవీందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 299 బేళ్ల వస్త్రం ఎన్టీఆర్ మినీ స్టేడియంలోని గదుల్లో భద్రపరిచామని పేర్కొన్నారు. మండలాలకు వస్త్రాన్ని పంపుతామని తెలిపారు.

అభ్యాసన ఫలితాల ఆధారంగా బోధన చేస్తే న్యాస్‌లో ఉత్తీర్ణత



ఉపాధ్యాయులకు న్యాస్ పరీక్షపై శిక్షణ ఇస్తున్న రిసోర్స్ పర్సన్

ఖానాపూర్, జూలై 31 : అభ్యాసన ఫలితాల ఆధారంగా బోధన చేస్తే న్యాస్ పరీక్షలో (జాతీయ సాధన సర్వే పరీక్ష) విద్యార్థులు ఖచ్చితంగా ఉత్తీర్ణత సాధిస్తారని రిసోర్స్ పర్సన్ నారి వినోద్‌కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని పాత ఎల్లాపూర్ ఉన్నత పాఠశాల కాంప్లెక్స్ పరిధిలో ఉపాధ్యాయులకు న్యాస్ పరీక్షపై ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఖానాపూర్, పెంబి, కడెం, దస్తురాబాద్ మండలాలకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయులకు రిసోర్స్ పర్సన్ నారి వినోద్ కుమార్ న్యాస్ పరీక్షపై శిక్షణ ఇచ్చారు. నవంబరులో నిర్వహించే న్యాస్ పరీక్షకు ఉపాధ్యాయులను సమాయత్తం చేసేందుకు ఇటీవల రాష్ట్ర, జిల్లా స్థాయిలో పాఠశాల విద్యాశాఖ శిక్షణ ఇచ్చిందన్నారు. సబ్జెక్టుల వారీగా శిక్షణ పొందిన రిసోర్స్ పర్సన్స్ కాంప్లెక్స్ స్థాయిలో ఉపాధ్యాయులకు న్యాస్ పరీక్ష నిర్వహణ ప్రశ్నాపత్రం తీరును వివరించారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ కార్యదర్శి ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి సహా పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రుణమాఫీపై సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

ముథోల్, జూలై 31 : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం రూ. 2 లక్షల రుణమాఫీలో భాగంగా రెండవ విడతలో 1.50 వేలు రుణమాఫీ చేయడంపై ముథోల్ మండలంలోని గన్నోర గ్రామ రైతులు బుధవారం హర్షం వ్యక్తం చేశారు.

కొయ్యబొమ్మ పరిశ్రమకు గడ్డుకాలం



- ప్రధాని మోదీ ఎన్నికల హామీపై ఆశలు
- ప్రత్యేకపాలసీ కోసం ఎదురుచూపులు
- శిక్షణతో దక్కని ప్రయోజనం
- వెంటాడుతున్న పొనికి కలప కొరత

నిర్మల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : కొయ్యబొమ్మలకు క్రమంగా గడ్డుకాలం వచ్చింది. సాంప్రదాయ పద్దతిలో తయారు చేస్తున్న కొయ్యబొమ్మలకు బహిరంగ మార్కెట్‌లో డిమాండ్ ఉన్నప్పటికీ ముడిసరుకుల ధరలు పెరిగిపోవడం, అలాగే పొనికి కర్రకు కొరత ఏర్పడుతుండడంతో పాటు ఎగుమతులు, దిగుమతులకు సంబంధించిన విధానం సక్రమంగా లేకపోవడం, ప్రభుత్వం ఈ పరిశ్రమను ఆశించిన రీతిలో ప్రోత్సహించకపోవడంతో దీని మనుగడ ప్రశ్నార్థకమవుతోందంటున్నారు. ముడిసరుకు ధరల పెరుగుదల బొమ్మల తయారీపై ప్రభావం చూపుతోందని తద్వారా కళాకారుల ఉపాధికి గండి పడుతోందంటున్నారు. నిర్మల్ కొయ్య బొమ్మలకు జాతీయ, అంతర్జాతీయస్థాయిలో ప్రత్యేక గుర్తింపు ఉన్న సంగతి తెలిసిందే. అయితే ఇక్కడ తయారయ్యే కొయ్య బొమ్మలను దేశ, విదేశాల్లో కూడా విక్రయిస్తుంటారు. అంతర్జాతీయ మార్కెట్‌లో కూడా ఈ కొయ్య బొమ్మలకు ఆశించిన మేరకు డిమాండ్ ఉన్నప్పటికీ సంప్రదాయ రీతిలో ఉన్న మోడల్స్‌కు క్రమంగా ఆదరణ తగ్గుతోంది. అలాగే కొయ్య బొమ్మల తయారీ కోసం ఉపయోగించే ముడిసరుకు ధరలు పెరిగిపోవడం ఇతర ఖర్చులు భారీగా పెరిగిపోవడంతో ప్రస్తుతం కొయ్య బొమ్మల ధరలు కూడా పెరిగాయి. ముడిసరుకు కొరత, ధరల పెరుగుదలతో బొమ్మలకు గిరాకీ క్రమంగా తగ్గుతోంది. ఈ పరిశ్రమను బలోపేతం చేసేందుకు గానూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎలాంటి కార్యాచరణ చేపట్టకపోతుండడం కూడా ఈ పరిశ్రమకు శాపంగా మారుతుంది. అయితే ఈ నేపథ్యంలోనే ఇటీవల ఎన్నికల ప్రచారం కోసం వచ్చిన ప్రధాన మంత్రి నరేంద్రమోడీ ఈ కొయ్య బొమ్మల పరిశ్రమను ఆదుకుంటామని, రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విధ్వంసం చేసిందని, కళాకారుల పొట్టకొట్టిందంటూ ప్రకటించారు. కేంద్రప్రభుత్వం అన్నివిధాలుగా కొయ్య బొమ్మల పరిశ్రమను ఆదుకుంటుందని ఈ పరిశ్రమను ప్రోత్సహించేందుకు ప్రత్యేక విధానాన్ని రూపొందిస్తామని మోడీ హామీ ఇచ్చారు. ప్రధాని మోడీ హామీతో నిర్మల్ కొయ్య బొమ్మల కళాకారుల కుటుంబాల్లో కొత్త ఆశలు నెలకొన్నాయి. అయితే ఎన్నికలు ముగిసి రాష్ట్రంలో కొత్తప్రభుత్వం ఏర్పడినప్పటికీ ఇప్పటి వరకు రాష్ట్రప్రభుత్వం గాని, కేంద్ర ప్రభుత్వం గాని కొయ్య బొమ్మల పరిశ్రమకు సంబంధించిన ఎలాంటి ప్రకటన వెలువడకపోతుండడంతో కళాకారులు ఆందోళనకు గురవుతున్నారు. ప్రధాని ఇచ్చి హామీని వెంటనే అమలు చేయాలని వారంతా కోరుతున్నారు. ఇదిలా ఉండగా కొద్దిరోజుల క్రితం కేంద్రం జౌళిశాఖ ఆధ్వర్యంలోని ఎక్స్‌పోర్టు ప్రమోషన్ కౌన్సిల్ ఫర్ హ్యాండిక్రాఫ్ట్ సంస్థ మార్కెట్‌లో డిమాండ్‌కు అనుగుణంగా నిర్మల్ కొయ్య బొమ్మలకు కొత్త అందాలు తెచ్చేందుకు నిర్ణయం తీసుకుంది. ఇంటర్నేషనల్ లేస్ ట్రేడ్ సెంటర్ ఆధ్వర్యంలో గురుశిష్య హస్తశిల్ప ప్రశిక్షణ కార్యక్రమం కింద నిర్మల్ కొయ్య బొమ్మల కేంద్రాన్ని మాత్రమే ఎంపిక చేయడం ప్రాధాన్యతను సంతరించుకుం టోంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తిరుపతిలోని లక్ష్మి గారి పల్లె, విశాఖ జిల్లాలోని ఏటికొప్పాక, కొండపల్లి బొమ్మలను ఈ పథకం కింద ఎంపిక చేశారు. తెలంగాణ రాష్ట్రంలో మాత్రం కేవలం నిర్మల్ కొయ్యబొమ్మలకు అత్యధిక ప్రాధాన్యతనిచ్చి కొయ్యబొమ్మల రూపురేఖలను మరింత ఆధునీకరించేందుకు సిద్ధమవుతున్నారు. గురుశిష్య హస్తశిల్ప ప్రశిక్షణలో భాగం గా కేవలం 25 సంవత్సరాల నుంచి 30 సంవత్సరాల్లోపు ఉన్న యువ కళాకారులకు ప్రాధాన్యతనిచ్చారు. వీరందరికీ మూడునెలల పాటు ఇక్కడ నిర్మల్ కొయ్యబొమ్మల కేంద్రంలో శిక్షణ నిర్వహించారు. మూడు నెలల పాటు శిక్షణ పూర్తయిన తరువాత వీరందరికీ ఆర్టిజన్ ఐడీ కార్డులను కూడా కేంద్ర జౌళిశాఖ అందించింది. ఈ ఆర్టిజన్ ఐడెంటీ కార్డుల ద్వారా దేశ, విదేశాల్లో నిర్వహించే ట్రెడ్‌ఫేర్‌లలో కొయ్యబొమ్మల ప్రదర్శనకు అవకాశాలు ఏర్పడ్డాయి. అలాగే జాతీయ, అంతర్జాతీయ మార్కెట్‌లలో కూడా కొయ్య బొమ్మల విక్రయాలకు కేంద్ర జౌళిశాఖ ఆధ్వర్యంలో ని ఎక్స్‌పర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ ఫర్ హ్యాండిక్రాఫ్ట్ సంస్థ చర్యలలు తీసుకోవాలని మొదట్లో భావించారు.



పొనికి కర్రతో కొయ్య బొమ్మలు తయారు చేస్తున్న కళాకారుడు

శిక్షణతో దక్కని ప్రయోజనం

నిర్మల్‌లోని కొయ్యబొమ్మల కేంద్ర వర్క్‌షాపులో గురుశిష్య హస్త శిల్ప ప్రశిక్షణ కార్యక్రమాన్ని ఇప్పటికే నిర్వహించారు. యువ కళాకారులకు ఆధునిక మోడల్స్ కొయ్య బొమ్మల తయారీకి సంబంధించి అవగాహన కల్పించారు. కేవలం కొయ్య బొమ్మల తయారీతో పాటు బహిరంగ మార్కెట్‌లో రోజు రోజుకు పెరుగుతున్న పోటీ, అలాగే ప్రజల ఆసక్తి, డిమాండ్‌ను కూడా పరిగణలోకి తీసుకొని బొమ్మలను తయారు చేసే విధంగా ఇక్కడ శిక్షణ ఇచ్చినప్పటికీ ఈ శిక్షణ ద్వారా కళాకారులకు పెద్దగా ప్రయోజనం చేకూరలేదంటున్నారు. కేవలం ఓ తంతులాగా మాత్రమే ఈ శిక్షణ కొనసాగిందని కళాకారులు అభిప్రాయపడుతున్నారు.

వెంటాడుతున్న పొనికి కలప కొరత

కాగా పదేళ్ల నుంచి కొయ్య బొమ్మల పరిశ్రమను పొనికి కలప కొరత వెంటాడుతోంది. ప్రస్తుతం అడవులల్లో పొనికి చెట్ల సంఖ్య తగ్గిపోతుండడం, ప్రత్యేకంగా ప్లాంటేషన్ చేపట్టకపోతున్న కారణంగా కలప కొరత ఏర్పడుతోంది. కేవలం ఒకటి రెండు టింబర్ డిపోలలో మాత్రమే పొనికి కలప నిలువలున్నాయి. కొద్దిరోజుల క్రితం ఉపాధి హామీ పథకం కింద నిర్మల్‌లోని పలుచోట్ల పొనికి ప్లాంటేషన్ చేపట్టినప్పటికీ వాటి పెంపకం ఇటీవల పూర్తి కాదంటున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పొనికి ప్లాంటేషన్‌ను మరింత విస్తృతంగా చేపట్టినట్లయితేనే ఈ కలపకు కొరత తీరుతుందని చెబుతున్నారు.

ప్రధాని మోదీ హామీ అమలు కావాలి

కొయ్యబొమ్మల పరిశ్రమను ఆదుకుంటామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన హామీ వెంటనే అమలు కావాలి. ప్రధాని కొయ్యబొమ్మల పరిశ్రమను ప్రోత్సహించేందుకు కొత్తపాలసీ రూపొందిస్తామన్నారు. వెంటనే ఆ పాలసీని రూపొందించాలి. ప్రధాని హామీ తమ కళాకారుల జీవితాల్లో కొత్త ఆశలు నింపింది. ఇప్పటికే ఉపాధి లేక కొయ్యబొమ్మలకు సరియైన మార్కెట్ లేక తాము నష్టాల పాలవుతున్నాం. పరిశ్రమను ముందుకు నడపడం కష్టమవుతుంది. ప్రధానమంత్రి ప్రత్యేక ప్రోత్సాహకాలు అందజేస్తారని ఆశిస్తున్నాం.

- పెంటయ్య, కొయ్యబొమ్మల కళాకారుడు, నిర్మల్

ప్రధానికి రుణపడి ఉంటాం

సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న నిర్మల్ కొయ్యబొమ్మల పరిశ్రమను ఆదుకుంటామంటూ ప్రధాని నరేంద్రమోడీ ఇచ్చిన హామీ తమ కళాకారుల జీవితాలలో ఆశలు నింపింది. ఆయనకు జీవితాంతం కళాకారుల కుటుంబాలన్నీ రుణపడి ఉంటాయి. ఇచ్చిన హామీ అమలు చేసి, వెంటనే పరిశ్రమ రక్షణకు చర్యలు మొదలుకావాలి.

- నాంపల్లి రాజశేఖర్, కొయ్యబొమ్మల కళాకారుడు, నిర్మల్

'డ్రై డేపై పల్లెల్లో అవగాహన కల్పించాలి'



గ్రామ పంచాయతీ రికార్డులు పరిశీలిస్తున్న డీఎల్‌పీవో

దిలావర్‌పూర్, జూలై 31 : డ్రై డేపై పల్లెల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని డీఎల్‌పీవో రమేష్ అన్నారు. బుధవారం మండలంలోని గుండంపల్లిలో స్టీల్ బ్యాంకును పరిశీలించారు. గ్రామ పంచాయతీ రికార్డులను తనిఖీ చేశారు. పల్లె ప్రకృతి వనం సందర్శించారు. గ్రామంలో పారిశుధ్య నిర్వహణను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ... పారిశుధ్య నిర్వహణపై అశ్రద్ధ పనికి రాదని అన్నారు. ఎప్పటికప్పుడు మురికి కాలువల్లో పూడిక తొలగించాలన్నారు. రోడ్లను శుభ్రం చేయాలన్నారు. డీఎల్‌పీవో వెంట ఎంపీవో గోవర్ధన్, పంచాయతీ కార్యదర్శి స్వాతి, తదితరులున్నారు.

'పారిశుధ్యంపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు'



కుభీర్‌లో పారిశుధ్యాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌పీవో

కుభీర్, జూలై 31 : పారిశుధ్యంపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని డీఎల్‌పీవో సుదర్శన్‌పటేల్ అన్నారు. బుధవారం మండల కేంద్రం ప్రభుత్వ ఆసుపత్రిని పరిశీలించి పారిశుధ్య పనులను చేపట్టారు. గ్రామంలోని మురికి కాలువలను శుభ్రపరిచి బ్లీచింగ్ వేసి దోమలు, ఈగలు వ్యాప్తి చేందకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. గ్రామస్థులకు సీజనల్‌వ్యాధులపై అవగాహన కల్పించాలని, ఆరోగ్య సమస్యలుంటే వెంటనే ఆసుపత్రిలో చూపించుకునేలా ఆరోగ్య సిబ్బంది అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ఈయన వెంట పంచాయతీ వైద్యులు డా. ప్రణయ్, కార్యదర్శి రాజేశ్, కారోబారి ప్రకాష్, అధికారులు, సిబ్బంది ఉన్నారు.

3 నుంచి మధ్యప్రదేశ్‌లో గౌడ జాతీయ సమ్మేళనం

నిర్మల్ కల్చరల్, జూలై 31 : ఈ నెల 3, 4న మధ్యప్రదేశ్ రాష్ట్ర రాజధాని భూపాల్‌లో గౌడ జాతీయ సమ్మేళనం గౌడ వధూవరుల పరిచయ వేదిక నిర్వహిస్తున్నట్లు మోకుదెబ్బ జాతీయ అధ్యక్షుడు అమరవేణి నర్సాగౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని గౌడ, శెట్టి బలిజ, శ్రీశైన వివిధ పేర్లతో ఉన్న గౌడ కులస్థులు వినియోగించుకోవాలని కోరారు.

11న అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవ సభ

నిర్మల్ కల్చరల్, జూలై 31 : జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో భవనంలో ఈ నెల 11న అంతర్జాతీయ ఆదివాసి దినోత్సవ సభ నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా కార్యదర్శి తొడసం శంభు తెలిపారు. బుధవారం ఇందుకు సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరించారు. ఆగస్టు 9న ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలన్నారు. ఆదివాసీల అభివృద్ధిని ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగులు, విద్యార్థులు, మేధావులు, ఆదివాసీ ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దాలి

- కలెక్టర్ అభిలాష అభినవ్



పాఠశాలలో విద్యార్థులను ప్రశ్నలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్



స్వర్ణప్రాజెక్టును పరిశీలిస్తున్న కలెక్టర్

సారంగాపూర్ రూరల్, జూలై 31 : ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు విద్యను అభ్యసిస్తూ పాఠశాలలను తీర్చిదిద్దాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. బుధవారం మండలంలోని జామ్ గ్రామ సమీపంలో గల సాంఘిక సంక్షేమ బాలిక పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. తరగతి గదిలో పదవతరగతి విద్యార్థులకు పాఠాలను బోధించి సబ్జెక్టుల వారీగా ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు కష్టపడి చదివి జీవితంలో ఉన్నత స్థానాల్లో నిలవాలని సూచించారు. కష్టపడి చదివి పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులకు, పాఠశాలలకు గుర్తింపు తీసుకురావాలని విద్యార్థులతో పేర్కొన్నారు. ప్రతీరోజు విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలని సిబ్బందితో పేర్కొన్నారు. విద్యార్థులకు సీజనల్ వ్యాధులు సోకకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం పాఠశాలలో మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారి రవీందర్‌రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డా. ధనరాజ్, నీటిపారుదల శాఖ ఈఈ లక్ష్మీ, డీఈ శ్రీనివాస్, తహసీల్దార్ శ్రీదేవి, ఎంపీడీవో లక్ష్మీకాంతారావు, ఆయా శాఖల అధికారులు ఉన్నారు.

తహసీల్దార్ కార్యాలయాన్ని పరిశీలించిన కలెక్టర్

సారంగాపూర్ రూరల్, జూలై 31 : మండల కేంద్రంలో గల తహసీల్దార్ కార్యాలయాన్ని బుధవారం కలెక్టర్ అభిలాష అభినవ్ పరిశీలించారు. తహసీల్దార్ శ్రీదేవిని ధరణి సమస్యల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదుల విభాగంలో వచ్చినటువంటి ఫిర్యాదులను వెంటనే పరిష్కారమయ్యేలా కృషి చేయాలని తెలిపారు. అనంతరం స్వర్ణ ప్రాజెక్టును పరిశీలించి, ప్రాజెక్టు వివరాలను ఇరిగేషన్ అధికారులకు అడిగి తెలుసుకున్నారు. వరద నీరుపై ప్రాజెక్టు పరివాహక ప్రాంత ప్రజలకు సమాచారాన్ని అందించాలన్నారు. ఈమె వెంట అధికారులు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి సత్వరమే చర్యలు చేపట్టాలి

- భైంసా మున్సిపల్ సమావేశంలో కౌన్సిలర్ల డిమాండ్



భైంసా మున్సిపల్ వైస్ చైర్మెన్ జాబీర్ అహ్మద్‌కు వినతిపత్రం అందచేస్తున్న కౌన్సిలర్లు

భైంసా, జూలై 31 : పట్టణ పరిధిలో పెరుకపోతున్న సమస్యల పరిష్కారానికి కాలయాపనకు తావులేకుండా సత్వరమే చర్యలు చేపట్టాలని భైంసా మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో పలువురు కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. బుధవారం మున్సిపల్ చైర్ పర్సన్ సాబీయా బేగం అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. ఇందులో కౌన్సిలర్లు సిందే కపిల్, చందులాల్, తోట విజయ్, గౌతం పింగ్లే, దరశథ్‌లు తమ తమ వార్డు పరిధిలలో నెలకొన్న సమస్యల ఎకరువు పెట్టారు. మిషన్ భగీరథ పైప్‌లైన్ల ఏర్పాటుతో అంతర్గత రోడ్లన్నీ దుస్థితికి చేరుకుని గుంతలమయమయ్యాయని వివరించారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షపు నీరు గుంతలలో నిలిచి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పట్టణ పరిధిలో విద్యుత్ తీగలు వేలాడుతూ ప్రమాదకర స్థితికి చేరుకున్న పట్టించుకునే వారే కరువయ్యారని పెర్కొన్నారు. వినాయక చవితి వేడుకలు సమీపిస్తున్న నేపథ్యంలో విద్యుత్ వ్యవస్థ మెరుగుదలకు, వీధి లైట్లు సక్రమంగా వెలిగే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇక వర్షాల మూలంగా శివారు ప్రాంతాల్లో పరిస్థితి అధ్వాన్న స్థితికి చేరుకుందని కౌన్సిలర్ చందులాల్ పెర్కొన్నారు. మట్టి రోడ్లు బుదమయమయ్యి నడువడానికి వీలు లేకుండా పోయిందని తెలిపారు. అంతర్గత రోడ్లకు ఇరువైపులా పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగా రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని పెర్కొన్నారు. ఇందుకు స్పందించిన మున్సిపల్ వైస్ చైర్మెన్ జాబీర్ అహ్మద్, ఇన్‌చార్జీ కమీషనర్ గౌరిష్‌లు సమస్యలను పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

శివాజీ మహరాజ్ విగ్రహ ప్రతిష్ఠాపన అనుమతికి వినతిపత్రం అందజేత

పట్టణంలోని నిర్మల్ క్రాస్ రోడ్డు వద్ద ఛత్రపతి శివాజీ మహరాజ్ విగ్రహ ప్రతిష్ఠాపనకు గాను కలెక్టర్ అనుమతి కోసం పలువురు కౌన్సిలర్లు మున్సిపల్ వైస్ చైర్మెన్ జాబీర్ అహ్మద్, ఇన్‌చార్జీ కమీషనర్ గౌరిష్‌కు వినతి పత్రం అందచేశారు. మున్సిపల్ తరపున కలెక్టర్‌కు సంబంధిత వినతి పత్రం నివేదించి అనుమతి కోసం చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. కౌన్సిలర్లు సిందే కపిల్, చందులాల్, తోట విజయ్, గౌతం పింగ్లే, దరశథ్‌లతో పాటు బీజేపీ ప్రతినిధి రావుల పోశెట్టి వినతి పత్రం అందచేసిన వారిలో ఉన్నారు.

ఎంఈవో కార్యాలయాన్ని పరిశీలించిన డీఈవో



సారంగాపూర్ రూరల్, జూలై 31 : మండల కేంద్రంలో గల ఎంఈవో కార్యాలయాన్ని బుధవారం డీఈవో రవీందర్‌రెడ్డి పరిశీలించారు. పాఠశాల వివరాలతో పాటు ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థుల సంఖ్యను ఎంఈవో మధుసూదన్‌ను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు ఉండేలా కృషి చేయాలన్నారు.

సంక్షిప్త సమాచారం

పొంగిపొర్లుతున్న వాగులు
స్తంభించిన రాకపోకలు

నిర్మల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో గత పదిరోజుల నుంచి క్రమం తప్పకుండా వర్షాలు కురుస్తున్నాయి. ముఖ్యంగా వాగులు, వంకలు పొంగి ప్రవహించడంతో రాకపోకలు స్తంభించాయి. జిల్లాలో ప్రధాన సాగునీటి ప్రాజెక్టులైన కడెం, స్వర్ణ ప్రాజెక్టుల ఎగువ ప్రాంతాల నుంచి వరద నీటి ప్రవాహం కొనసాగుతోంది. దీంతో కడెం, స్వర్ణప్రాజెక్టుల వరదగేట్లను ఎత్తి దిగువన ఉన్న వాగుల్లోకి నీటిని వదులుతున్నారు. కడెం ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 7.603 టీయంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 6.461 టీయంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి 3303 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుండడంతో అధికారులు అప్రమత్తమై ఒక వరద గేటును ఎత్తి దిగువన ఉన్న గోదావరిలోకి 2892 క్యూసెక్కుల వరద నీటిని వదులుతున్నారు. అలాగే జిల్లాలోని స్వర్ణప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 1.484 టీయంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 1.212 టీయంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. అలాగే గడ్డెన్న వాగు ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 1.852 టీయంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 0.877 టీయంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. జిల్లాలో బుధవారం నమోదైన వర్షపాతం వివరాలు ఈ విధంగా ఉన్నాయి. జిల్లా సగటు వర్షపాతం 4.7 మిల్లీ మీటర్లుగా నమోదు కాగా జిల్లాలో అత్యధికంగా ఖానాపూర్ మండలంలో 32 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. భైంసా మండలంలో 9.2 మిల్లీ మీటర్లు, అలాగే లోకేశ్వరం మండలంలో 2.0 మిల్లీ మీటర్లు, తానూర్ మండలంలో 8.2 మిల్లీ మీటర్లు, సారంగాపూర్ మండలంలో 1.8 మిల్లీ మీటర్లు, కడెం మండలంలో 1.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. అలాగే బాసర మండలంలో 2.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా ముథోల్ 6.2 మిల్లీ మీటర్లు, కుంటాలలో 3.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. అలాగే దిలావర్‌పూర్ మండలంలో 0.4 మిల్లీమీటర్లు, నిర్మల్ మండలంలో 1.6 మిల్లీమీటర్లు, నిర్మల్ రూరల్ మండలంలో 1.8 మిల్లీ మీటర్లు, మామడ మండలంలో 8.0 మిల్లీ మీటర్ల వర్షపాతం, సోన్ మండలంలో 1.8 మిల్లీ మీటర్లు, పెంబి మండలంలో 1.2 మిల్లీ మీటర్లు, దస్తూరాబాద్ మండలంలో 5.6 మిల్లీమీటర్లు, నర్సాపూర్ (జి) మండలంలో 2.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

ఆగస్టు 31 వరకు
30 పోలీసుయాక్ట్ అమలు

నిర్మల్ కల్చరల్, జూలై 31 : జిల్లాలో 30 పోలీసు చట్టం ఈ నెల 31 వరకు అమలులో ఉంటుందని ఎస్పీ జానకి షర్మిల బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శాంతి భద్రతల దృష్ట్యా పొడిగించినట్లు తెలిపారు. ప్రజలు చట్టాన్ని ఉల్లంఘిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. అనుమతులు లేకుండా ఎలాంటి సమావేశాలు, ర్యాలీలు నిర్వహించరాదని, మారణాయుధాలు, ప్రేలుడు పదార్థాలు ఇతరాత్ర వెంట పెట్టుకొని తిరగరాదన్నారు.

పదవీ విరమణ చేసిన
హెల్త్ వర్కర్‌కు సన్మానం

నిర్మల్ కల్చరల్, జూలై 31 : నిర్మల్ మున్సిపల్ హెల్త్ వర్కర్ చిన్న ముత్తన్న పదవీ విరమణ చేసిన సందర్భంగా చైర్మన్ ఈశ్వర్ బుధవారం ఘనంగా సన్మానించారు. ముత్తన్న సేవలు కొనియాడారు.

మాట ఇచ్చారు... నెరవేర్చండి

● అసెంబ్లీలో బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

నేరడిగొండ, జూలై31: అసెంబ్లీ ఎన్నికల వేళ బోథ్ మండల కేంద్రానికి వచ్చిన ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన మాట కట్టుబడాలని, ఇచ్చిన హామీలను నేరవేర్చాలని అసెంబ్లీ సమావేశాల్లో బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అన్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న శాసనసభ బడ్జెట్ సమావేశాల్లో మంగళవారం ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు సమస్యలను సభదృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల సమయంలో బోథ్ ప్రజలకు ఇచ్చిన హామీలైన కుప్టి ప్రాజెక్టు నిర్మాణం, బోథ్‌ను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు, బోథ్‌లో ప్రభుత్వ జనరల్ డిగ్రీ కళాశాల ఏర్పాటు, ఫైర్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు సాక్షాత్తు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలన్నారు. నూతన మండలాలుగా ప్రకటించిన సోనాల, భీంపూర్, సిరికొండలో మండల కార్యాలయాలు నిర్మించాలన్నారు. బోథ్ వంద పడకల ఆసుపత్రి నిర్మాణం చేపట్టాలన్నారు. ప్రస్తుతం నిర్మాణ పనులు ఆగిపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కుప్టి ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలని పేర్కొన్నారు. ఇచ్చోడను సబ్‌డివిజన్ చేయాలన్నారు. ఆలయాలకు నిధులు కేటాయించాలన్నారు.



ఖోదాడ్‌లో కిచెన్ గార్డెన్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీవో చంద్రశేఖర్

పాఠశాలలో కిచెన్ గార్డెన్ ఏర్పాటుతో విద్యార్థులకు ఆకు కూరలు

తలమడుగు, జూలై 31: పాఠశాలలో కిచెన్ గార్డెన్ ఏర్పాటుతో విద్యార్థులకు ఆకుకూరలను అందించవచ్చని ఎంపీడీవో చంద్రశేఖర్ కోరారు. బుధవారం మండలంలోని ఖోదాడ్ జిల్లా పరిషత్ పాఠశాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో కిచెన్ గార్డెన్ ఏర్పాటుతో విద్యార్థులకు నాణ్యమైన ఆకుకూరలను అందించవచ్చన్నారు. అలాగే విద్యార్థులకు చదువుతో పాటు కూరగాయాల సాగు విధానం, వ్యవసాయం పట్ల అవగాహన కల్పించవచ్చన్నారు. పాఠశాల విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలని సూచించారు. తప్పనిసరి వారానికి విద్యార్థులకు మూడు కోడి గుడ్లను అందించాలని, పాఠశాల పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచాని సూచించారు. ఇందులో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణకుమారి, పంచాయతీ సెక్రటరీ శివకుమార్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఊరంతా ఏకమయ్యారు..
రోడ్డును బాగు చేసుకున్నారు!

● పెద్దసల్యాద గ్రామస్తులది పెద్ద ఆలోచన ● 80 మంది.. 8 గంటలు కష్టపడి సమస్యను పరిష్కరించుకున్నారు



చిన్న, పెద్ద అంతా కలిసి రోడ్డుపై మొరం వేసి చదునుచేసే పనుల్లో నిమగ్నమైన పెద్దసల్యాద గ్రామస్థులు

ఇచ్చోడ, జూలై, 31: అధికారులు, ప్రజాప్రతినిధులు వస్తారు.. ఏదో చేస్తారు.. అని ఎదురు చూడలేదు ఆ గ్రామస్థులు. ఎవరో వచ్చి తమ గ్రామానికి రోడ్డు వేస్తారు? అని కూడా వేచి చూడలేదు. గ్రామంలోని యువత, పెద్దచిన్నా అందరూ కలిసి ఒక మాట అనుకున్నారు.. అనుకున్నట్లుగానే తల కొంత సొమ్ము కూడబెట్టుకొని ప్రతీ ఇంటి నుంచి చేయిచేయి కలిపి రోడ్డును బాగుచేసుకున్నారు. ఇచ్చోడ మండలంలోని మల్యాల గ్రామ రహదారి నుంచి పెద్దసల్యాద గ్రామానికి దాదాపు 2.5 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి రూ.2.19 కోట్ల ఐటీడీఏ నిధులతో సిమెంటు రహదారి మంజూరవ్వడంతో.. కొబ్బరికాయలు కొట్టి మరీ రోడ్డు త్వరలో పూర్తవుతుందని స్థానిక ప్రజాప్రతినిధులు హామీ ఇచ్చారు. దీంతో తమ ఊరికి రోడ్డు నిర్మాణం జరుగుతుందని ఏళ్ల కాల సాకారమవుతుందని సంతోషపడ్డారు ఆ గ్రామస్థులు. కానీ ఏడాది పూర్తికా వచ్చినా.. సదరు కాంట్రాక్టర్ ఇంకా పనులను ప్రారంభించకపోవడం గమనార్హం. ఈ విషయమై గ్రామస్థులు పలుమార్లు సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులతో కనీసం గ్రావెల్ పనులనైనా ప్రారంభించాలని కోరినా.. పట్టించుకునే నాథుడే కరువయ్యాడని గ్రామస్థులు తమ ఆవేదనను వెల్లబుచ్చుకున్నారు. అయితే, ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి పూర్తిగా కొట్టుకుపోయింది. నడిచేందుకు కూడా వీలు లేకుండా ప్రమాదకరంగా మారింది. దీనిపై గ్రామస్థులు ప్రజాప్రతినిధులతో పాటు పలుమార్లు కలిసి తమగోడును వెళ్లబోసుకున్నా.. ఎలాంటి ఫలితం లేకుండా పోయింది. నిధులు మంజూరైన పనులు చేపట్టకపోవడంతో గ్రామస్థులందరూ ఏకతాటిపైకి వచ్చారు. బండ బండ పేర్చి, మొరం వేసి దాదాపు 80 మంది 8గంటల పాటు కష్టపడి రహదారిని బాగుచేసుకున్నార. మారుమూల గిరిజన పెద్దసల్యాద గ్రామస్థుల ఆలోచన చాలా పెద్దదనే మన్ననలు పొందారు ఆ గిరిజన గ్రామస్థులు!!

మర్లపెల్లి రోడ్డుపై రెండు ఆటోల ఢీ

● పది మంది కూలీలకు గాయాలు

● ఐదుగురు క్షతగాత్రులను రిమ్స్‌కు తరలింపు

బోథ్, జూలై 31: బోథ్‌మండల కేంద్రంలోని మర్లపెల్లి రోడ్డుపై బుధవారం సాయంత్రం రెండు ఆటోలు ఢీకొని పది మందికి గాయాలయ్యాయి. వీరిలో నుంచి ఐదుగురిని ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి..

బోథ్ సమీపంలోని పంట చేలకు కలుపు తీసేందుకు వెళ్లి తిరిగి వస్తుండగా మరలపెల్లి వైపు వెళుతున్న ఆటో బోథ్ వైపు వస్తున్న ఆటోని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పది మందికి గాయాలయ్యాయి. అయితే, ఇందులో బోథ్‌కు చెందిన కదం ఇందిరా బారే పద్మ, సంగేపు గంగామణి, సంగేపు అనూష, ముచ్చుల నాగమణి, మంత్రి నారాయణలతో పాటు కరత్వాడకు చెందిన షేక్ అగనాస్, కొత్తపల్లికి చెందిన నాగేందర్‌లకు గాయాలయ్యాయి. వీరందరినీ 108 వాహనం ద్వారా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మరో ఇరువురు ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అయితే ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఐదుగురిని రిమ్స్ ఆసుపత్రికి ఆదిలాబాద్ తరలించడం జరిగింది. వీరికి తీవ్ర గయాలు కావడంతో ఆదిలాబాద్ పంపించడం జరిగిందని డాక్టర్ అదిత్య తెలిపారు. అదేవిధంగా ఎదురెదురుగా వస్తున్న ఆటోలు.. మరో ఆటోను తప్పించబోయి ఢీకొన్నట్లు తెలిసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బి.రాము తెలిపారు. కాగా ప్రమాదం జరిగిన విషయం తెలపడంతో బోథ్ గ్రామానికి చెందిన వారితో పాటు పలు గ్రామాల వారు ఆసుపత్రికి భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఆసుపత్రిలో తమ వారి క్షేమ సమాచారం కోసం ఆందోళన పడ్డారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

ఉట్నూర్, జూలై 31: మండలకేంద్రంలోని జూనియర్ సివిల్‌జడ్జి కోర్టు సమీపంలో ఉట్నూర్ ఆదిలాబాద్ ప్రధాన రహదారి పై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు కాగా పరిస్థితి విషమంగా ఉంది. ఉట్నూర్ నుంచి నార్నూర్ వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న నార్నూర్ మండలానికి చెందిన రాథోడ్‌ప్రకాష్ వాహనం అదుపుతప్పి పడిపోవడంతో ప్రకాష్‌కు తీవ్రగాయాలు కాగా ఆయన వెంట ఉన్న రామేశ్వరుకు కుడికాలు విరిగి గాయాలు అయ్యాయి. క్షతగాత్రులను వెంటనే ఉట్నూర్ పట్టణంలోని సివిల్ ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్సలు అందించిన అనంతరం ప్రకాష్ పరిస్థితి విషమంగా ఉండడంతో 108 వాహనంలో మెరుగైన వైద్యం కోసం జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించారు. మరో అంబులెన్స్‌లో రామేశ్వరుని కూడా జిల్లా కేంద్ర ఆసుపత్రికి వైద్యం కోసం తరలించారు.

ఏడుగురు పేకాటరాయుళ్ల పట్టివేత

బోథ్, జూలై 31: మండలంలోని మర్లపల్లి గ్రామానికి చెందిన ఏడుగురు పేకాటరాయుళ్లను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. పేకాట ఆడుతున్నట్లు పక్కా సమాచారం రావడంతో బుధవారం సాయంత్రం పేకాట అడ్డపై పోలీసులు దాడి చేసి పట్టుకోవడం జరిగింది. వీరి వద్ద నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది.

'ప్రిన్సిపాల్ బదిలీని ఆపండి'

ఆదిలాబాద్ రూరల్, జూలై 31: పట్టణంలోని డిగ్రీ ఆర్ట్స్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ జలగం అనిత బదిలీలో భాగంగా స్థానచలనం లభించింది. దీంతో విద్యార్థులు ఆవేదన గురయ్యారు. ప్రిన్సిపాల్ బదిలీని ఆపాలంటూ బుధవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు.



ఉద్యోగ విరమణ పొందిన హెడ్‌కానిస్టేబుల్‌ను సన్మానిస్తున్న ఎస్పీ గౌస్‌ఆలం

శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో గడపాలి

● ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ గౌస్‌ఆలం

ఆదిలాబాద్ అర్బన్, జూలై 31: పోలీసు శాఖలో సుదీర్ఘకాలం పాటు సేవలందించిన హెడ్‌కానిస్టేబుల్ ఆడే ఉత్తమ్ పదవి విరమణ కార్యక్రమం స్థానిక పోలీసు ముఖ్య కార్యాలయంలో జిల్లా ఎస్పీ గౌస్‌ఆలం సమక్షంలో నిర్వహించారు. ఉద్యోగ విరమణ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ఎస్పీ మాట్లాడుతూ శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో ఆనందంగా ఆరోగ్యాన్ని కాపాడుకుంటు జీవించాలని తెలిపారు. సిబ్బంది పోలీసు వ్యవస్థకు నిర్విరామంగా అందించిన సేవలు చిరస్మరణీయంగా ఉంటాయ న్నారు.1990లో పోలీసు వ్యవస్థలోకి కానిస్టేబుల్‌గా అడుగుపెట్టి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 19 పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహించి, నాలుగు సంవత్సరాల పాటు ఉట్నూర్ షీ టీంలో మహిళలకు రక్షనగా విధులను నిర్వహించడం జరిగిందన్నారు. 2018లో హెడ్‌కానిస్టేబుల్‌గా పదోన్నతి పొంది ఉట్నూర్‌లో ప్రస్తుతం విధులను నిర్వర్తించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆడే ఉ త్తమ్‌కు జిల్లా ఎస్పీ కుటుంబ సభ్యుల సమక్షంలో శాలువా పూలమాలతో సత్కరించి బహుమతి అందించి అభినందనలు తెలిపారు. ఇందులో సీసీ దుర్గం శ్రీనివాస్, జిల్లా పోలీసు అసోసియేషన్ అధ్యక్షుడు పెంచాల వెంకటేశ్వర్లు, ప్రజా ఫిర్యాదుల విభాగం అధికారిని జైస్వాల్ కవిత, సభ్యులు గిన్నెల సత్య నారాయణ, చిందం దేవిదాస్, తదితరులు పాల్గొన్నారు.

ఏసీబీ కేసులో రిటైర్డ్ సీఐకి జైలు శిక్ష

ఆదిలాబాద్, జూలై 31(ఆంధ్రజ్యోతి): ఓ కేసులో నిందితున్ని అరెస్టు చేసి కోర్టులో హాజరు పర్చే విషయంలో లంచం ఇవ్వాలని డిమాండ్ చేసి ఏసీబీకి పట్టుబడిన సీఐకి జైలు శిక్షతో పాటు రూ.20వేల జరిమానాను వధిస్తూ కరీంనగర్ ఏసీబీ స్పెషల్ కోర్టు తీర్పును వెలువరించింది. ఈ మేరకు స్పెషల్ కోర్టు న్యాయమూర్తి కుమార్ వివేక్ సీఐ చింతల లచ్చన్నకు అవినీతి నిరోధక చట్టం 1988 ప్రకారం ఐదేళ్ల కఠిన కారాగార శిక్షవిధించారు. ఏసీబీ స్పెషల్ కోర్టు పీపీ పి.కిషోర్‌కుమార్ ప్రాసిక్యూషన్ తరఫున వాదనలు వినిపించారు. ఈ కేసు పూర్వాపరాల ప్రకారం... ఆదిలాబాద్ జిల్లా వాంకిడి పోలీసు స్టేషన్‌లో క్రైం నెంబర్14/2013, సెక్షన్ 354, 448 ఐపీసీలో నిందితునిగా ఉన్న ఉప్పుల కృష్ణను జ్యూడిషియల్ రిమాండ్‌కు పంపించేందుకు అప్పుడు ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న చింతల లచ్చన్న రూ.10వేలు డిమాండ్ చేశారు. నిందితుని తల్లి ఉప్పుల శశికళ అప్పుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. అప్పుడు కరీంనగర్ రేంజ్ ఏసీబీ డీఎస్పీ టి.సుదర్శన్‌గౌడ్ ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్ లంచం తీసుకుంటుండగా ట్రాప్ చేశారు. ఈ కేసుకు సంబంధించిన చార్జీషీటును ఇన్‌స్పెక్టర్ రమణ మూర్తి కోర్టులో దాఖలు చేయగా ప్రస్తుతం ఈ కేసు ఐఓగా ఇన్‌స్పెక్టర్ వై.కృష్ణ కుమార్ వ్యవహరిస్తున్నారు. 2013లో జరిగిన ఈ ఏసీబీ ట్రాప్‌కు సంబంధించిన తీర్పుపై ప్రత్యక్ష సాక్షుల నుంచి సేకరించిన వాంగ్మూలాలు, ఏసీబీ అధికారులు కోర్టు ముందు ఉంచిన ఆధారాలను పరిశీలించిన కోర్టు ఈ మేరకు తీర్పునిచ్చింది. చింతల లచ్చన్నకు రూ.20వేల జరిమానా కూడా విధించింది.

మున్సిపల్ కార్మికుల కోసం వైద్య శిబిరం

ఆదిలాబాద్ రూరల్, జూలై 31: ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతున్న మున్సిపల్ పారిశుద్య కార్మికుల ఆరోగ్య పరిరక్షణకు వైద్య శిబిరం నిర్వహించడం జరిగిందని డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్,మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్ పేర్కొన్నారు. ఏఐటీయూసీ విజ్ఞప్తితోపాటు కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం ఆదిలాబాద్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో కార్మికుల కోసం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసార రంగానికి నిధులు తగ్గించడాన్ని
నిరసిస్తూ బడ్జెట్ పత్రాలు దహనం

నిర్మల్ అర్బన్, జూలై 31 : కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి బడ్జెట్‌లో నిధులు తగ్గించడాన్ని నిరసిస్తూ ఎస్‌కేఎం ఆధ్వర్యంలో బడ్జెట్ పత్రాలను దహనం చేశారు.. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం నూతన్‌కుమార్, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి కే.రాజన్నలు మాట్లాడుతూ... నరేంద్రమోదీ సర్కార్ వ్యవసాయ రంగానికి బడ్జెట్‌లో కేటాయించడంలో ముందుచూపు లేదు. సరిపోయే నిధులను కేటాయించడం లేదన్నారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి కే. రాజన్న, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు దుర్గం నూతన్‌కుమార్, డాకూర్ తిరుపతి ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం నాయకులు పాల్గొన్నారు.

పాములతో సహవాసమే ప్రాణం తీసింది

● ఇంట్లో పుట్ట వెలసిన దైవమని భావించి తొలగించని వృద్ధురాలు ● ఇల్లు అలుకుతుండగా కాటు వేసిన నాగుపాము ● ఆసుపత్రికి వెళ్లడంలో ఆలస్యం ● మార్గమధ్యంలోనే గంగవ్వ మృతి



గంగవ్వ ఇంట్లో వెలిసిన పుట్ట ఇదే



గంగవ్వ మృతికి కారణమైన పామును పట్టుకుని డబ్బాలో వేస్తున్న దృశ్యం

ఖానాపూర్, జూలై 31 : తన ఇంట్లో పుట్ట వెలవడంతో ఆందోళన చెందకుండా దైవమని భావించి ఆ పుట్టకు పూజలు నిర్వహించి పాములతో సహవాసం చేసిన వృద్ధురాలు చివరికి ఆ పాము కాటుకే బలైన ఘటన ఖానాపూర్ మండలం గోసంపల్లె గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే ఖానాపూర్ ఎస్సై లింబాద్రి తెలిపిన కథనం ప్రకారం... గోసంపల్లె గ్రామానికి చెందిన అరుగుల గంగవ్వ(65) అనే వృద్ధురాలు ఇంట్లో కొన్నేళ్ల క్రితం పుట్ట వెలసింది. ఆ పుట్టను వెంటనే తొలగించకుండా అది దైవదినంగా భావించిన గంగవ్వ రోజు ఆ పుట్టకు పూజలు చేసేది. ఆ పుట్టకు పూజలు చేయడమే కాకుండా అదే ఇంట్లో తాను కూడా నివాసం ఉండేది. అలా నివాసముంటున్న క్రమంలో ఆమెకు పలుమార్లు పుట్టలో పాము సైతం కనిపించినప్పటికీ ఏళ్ల తరబడిగా ఆ పాములతోనే కలిసి సహవాసం చేస్తూ జీవనం సాగించింది. తన కుమారుడు రాయలింగు పక్కనే ఇళ్లు కట్టుకున్న ఆ ఇంటికి వెళ్లకుండా గంగవ్వ అదే పూరి గుడిసెలో పాముల పుట్టల నడమే జీవనాన్ని కొనసాగించింది. కాగా మంగళవారం ఉదయం రోజువారి లాగే ఇళ్లను అలికి పుట్ట వద్ద సైతం పూజ నిర్వహించేందుకు అలుకు వేయడానికి వెళ్లడంతో ఆ పుట్టలోంచి పాము బయటకు వచ్చి గంగవ్వ చేతిపై కాటు వేసింది. అయినా అది దేవుడి పామేనని తనకు ఏమీ కాదంటూ ఎవరికీ చెప్పకుండా కాలయాపన చేసింది. ఆ తర్వాత కొద్దిసేపటికి తల తిప్పడం లాంటి లక్షణాలు కనిపించడంతో చుట్టుపక్కల వాళ్లని పిలిచి కడెం మండలంలోని లింగాపూర్ గ్రామానికి నాటు వైద్యం కోసం వెళ్లింది.

పరిస్థితి విషమించిందని తాము వైద్యం చేయలేమని అక్కడి నాటు వైద్యులు చెప్పడంతో ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్తుండగా మార్గ మధ్యంలో గంగవ్వ మృతి చెందిందని ఎస్సై లింబాద్రి పేర్కొన్నారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు బుధవారం ఉదయం ఘటన స్థలాన్ని పరిశీలించారు. గంగవ్వ మృతికి కారణమైన నాగుపామును పట్టేందుకు అటవీశాఖ సిబ్బందిని పిలిపించి ఇంట్లో పుట్టలో ఉన్న పామును పట్టించి అడవికి తరలించారు. ఈ సందర్భంగా ఎస్సై లింబాద్రి మాట్లాడుతూ... పాముకాటుకు గురైన వ్పుడు వెంటనే అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు.

ఇటువంటి మూఢ నమ్మకాలకు పోయి విషపూరితలతో కలిసి సహజీవనం చేయాలనే ఆలోచన ఎవరూ చేయవద్దన్నారు. పాముకాటుకు గురైన గంగవ్వ సకాలంలో స్పందించి ఉంటే ఆమె ప్రాణాలు దక్కేవని మూఢ నమ్మకంతో వ్యవ హరించడంతోనే విలువైన ప్రాణాలు కోల్పోవాల్సి వచ్చిందిన ఎస్సై తెలి పారు. గంగవ్వ అంగన్‌వాడీ ఆయాగా విధులు నిర్వహించి ఇటీవలనే పదవీ విరమణ పొందారన్నారు. గంగవ్వకు కుమారుడు రాయలింగు, కూతురు ఉన్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం కుమారుడు బ్రతుకుతెరువు కోసం దుబాయ్ దేశానికి వలస వెళ్లినట్లు పేర్కొన్నారు.

బస్‌పాస్‌ల కోసం దరఖాస్తుల స్వీకరణ


కుభీర్, జూలై 31 : మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో బుధవారం మండలంలోని ఆయా గ్రామాల వికలాంగుల నుండి బస్‌పాస్‌ల కోసం దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆర్‌టీసీ అధికారి శ్రీనివాస్ మాట్లాడారు. దివ్యాంగులకు వికలాంగులకు ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను ఉచిత బస్‌పాస్‌లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సుమారు 18 మంది వికలాంగుల నుండి దరఖాస్తులను స్వీకరించారు. ఇంకా మండలంలోని మిగిలి ఉన్న అర్హులైన వికలాంగులు మండల కేంద్రంలోని వికలాంగుల జిల్లా ఉపాధ్యాక్షులు పుప్పాల పీరాజీకి అందజేయాలని సూచించారు. అర్హులైన వారికి రెండు రోజుల్లో అందజేస్తామని పేర్కొన్నారు.

విద్యుత్‌షాక్‌తో ఎద్దు మృతి

మామడ రూరల్, జూలై 31 : మండలంలోని కమల్‌కోట్ గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్ సపోర్ట్ వైర్‌కు కరెంటు రావడంతో జి. లింగన్న అనే రైతుకు చెందిన ఎద్దు విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందిందని గ్రామస్థులు తెలిపారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ... విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతోనే ఈ ఘోరం జరిగిందని, ఇటువంటి సంఘ టనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు. వ్యవసాయంపై ఆధారపడిన కుటుంబంలో ఎద్దు మృతి చెందడంతో రైతు కన్నీరు మున్నీరయ్యారు. ఎద్దు విలువ రూ. 60 వేలు ఉంటుందని, ప్రభుత్వం తనను ఆదుకొని నష్టపరిహారం చెల్లించాలని తెలిపారు.

ఆంధ్రజ్యోతి

andhrajyothy.com బుధవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 34.3 । కనిష్ఠం 24.7



ఆదిలాబాద్

జిల్లా వార్తలు

5

గురువారం 1 ఆగస్టు 2024

సమాజ అభ్యున్నతి కోసం కృషి : రామన్న

మావల, జూలై 31: సమాజ అభ్యున్నతి కోసం గంగారం వాగ్మరే అవిశ్రాంత కృషి చేశారని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. అన్నబావుసాఠే కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు గంగారాం వాగ్మారే ప్రథమ వర్ధంతి కార్యక్రమాన్ని బుధవారం పట్టణంలోని పిట్టలవాడలో గల మాంగ్ సమాజ్ కమిటీ హాల్ ప్రాంగణంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన రామన్న గంగారాంవాగ్మారే చిత్రపటం వద్ద పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ఇందులో ఉద్దవ్ కంలే వసుదేవ్, ధమ్మాపాల్, మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్, నేతలు కుమ్ర రాజు, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.



● పత్తి పంటకు పురుగుమందులను పిచికారీ చేస్తున్న రైతులు

నకిలీ జోరు.. రైతు బేజారు!

- జిల్లాలో జోరుగా నకిలీ పురుగు మందుల అమ్మకాలు
- అమాయక రైతులకు అంటగడుతూ.. దండుకుంటున్న వ్యాపారులు
- ఫర్టిలైజర్ దుకాణాల వైపు అధికారులు కన్నెత్తి చూడడం లేదంటూ విమర్శలు
- ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి దిగుమతి
- క్షేత్రస్థాయిలో కొరవడుతున్న పర్యవేక్షణ
- తేలికగానే తీసుకుంటున్న సంబంధిత వ్యవసాయశాఖ అధికారులు
- ప్రస్తుతం అంతటా ఎడతెరపిలేని ముసురు వర్షాలు
- రోజురోజుకూ చీడపీడల ఉధృతి అధికమవడంతో అన్నదాతల ఆందోళన
- జిల్లావ్యాప్తంగా 4లక్షల ఎకరాలకు పైగా పత్తి, 82వేల ఎకరాల్లో సోయా, 60వేల ఎకరాల్లో కంది పంటల సాగు

ఆదిలాబాద్, జూలై 31(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అమాయక రైతులకు నకిలీ పురుగుమందులను అంటగడుతూ అందినకాడికి దండుకోవడం వ్యాపారులకు పరిపాటిగా మారింది. నకిలీ పురుగు మందుల అమ్మకాలు జోరుగా సాగుతున్నా.. అరికట్టేందుకు అధికారులు చర్యలు తీసుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. క్రమంతప్పకుండా ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీలు చేయాల్సిన అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. ప్రస్తుతం జిల్లాలో ఎడతెరిపి లేకుండా ముసురు వర్షాలు కురుస్తున్నాయి. దీంతో చీడపీడల ఉధృతి అధికమవడంతో అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు. ముఖ్యంగా వానాకాలం సీజన్‌లో అధికంగా సాగయ్యే పత్తి పంటను ఆశిస్తున్న చీడపీడల నివారణకు విచ్చలవిడిగా రసాయన, బయోమందులను పిచికారి చేస్తూ రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. కాని నకిలీ మందులతో చీడ పీడలు నశించడం లేదని పేర్కొంటున్నారు. జిల్లావ్యాప్తంగా 4లక్షల ఎకరాలకు పైగా పత్తి పంట సాగవుతుండగా.. 82వేల ఎకరాలలో సోయా పంట, 60వేల ఎకరాల లో కంది పంట సాగవుతున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. గతంలో బేల మండలంలో నకిలీ బయోమందుల తయారీ గుట్టురట్టయిన పొంతన లేని సమాధానం చెబుతూ.. వ్యాపారులు తప్పించుకోవడంతో బయోమాఫియా ఆగడాలకు ఇంకా అడ్డుకట్ట పడడం లేదు. అలాగే ఈ యేడు తలమడుగు మండలంలోని పల్సి(కె) గ్రామానికి చెందిన రైతు నకిలీ పురుగు మందులను పత్తి పంటపై పిచికారి చేయడంతో చీడపీడలు నశించడం దేవుడెరుగు.. కానీ ఉన్న పత్తి పంట ఎండిపోవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. కొండనాలుకకు మందు వేస్తే ఉన్న నాలుక ఊడిన చందంగా మారిందన్న టాక్ వినిపిస్తుంది. ప్రతీ ఏటా జిల్లాలో నకిలీ పురుగుమందుల వ్యవహారం వెలుగుచూస్తున్నా.. వ్యవసాయ అధికారులు తేలికగా తీసుకోవడం పలు అనుమానాలకు దారి తీస్తోంది.



గుట్టుగా సాగుతున్న దందా

జిల్లాలో నకిలీ పురుగు మందుల దందా గుట్టుగా సాగుతున్నట్లు తెలుస్తుంది. జిల్లా కేంద్రానికి చెందిన ఓ బడా వ్యాపారి రహస్యంగా నకిలీ మందుల తయారీకి పాల్పడుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. అలాగే మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి నాసిరకమైన రసాయన, బయోపురుగు మందులను తీసుకొచ్చి జిల్లాలో విక్రయిస్తున్నట్లు తెలుస్తుంది. పురుగు మందులను పిచికారి చేసిన చీడపీడలు చావడం లేదని, అలాగే పూత కాత కూడా రావడం లేదని రైతులు వాపోతున్నారు. బయోమందులపై ఎలాంటి ఎమ్మార్పీ ధరలు లేకపోయిన లీటరుకు రూ.3వేల నుంచి రూ.3,500 వరకు వసూలు చేస్తున్నారు. కొనుగోలు చేసిన ధరలకు రెండింతలుగా విక్రయిస్తూ అడ్డగోలుగా సంపాదిస్తున్నా.. అడిగే వారే కరువవుతున్నారు. దీంతో బయోమందులపై అధిక లాభాలు రావడంతో రసాయన మందుల కంటే బయోమందుల విక్రయాలనే ఎక్కువగా జరుపుతున్నారు. పంటలను ఏమాత్రం పరిశీలన చేయకుండానే.. కొందరు వ్యాపారులు పురుగు మందులను విక్రయిస్తున్నారు. నాణ్యత, పనితనంతో సంబంధం లేకుండానే ఎక్కువ లాభాలు వచ్చే పురుగుమందులను అమ్మేస్తున్నారు. కొన్ని కంపెనీలు ఆఫర్ల పేరిట అమ్మకాలను పెంచుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయి. కాలం చెల్లిన పురుగుమందులను కూడా రైతులకు అంటగడుతున్నారనే ఆరోపణలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

వ్యాపారులు ఇచ్చిందే మందు

క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించకుండానే వ్యాపారులు పురుగు మందులను విక్రయిస్తున్నారు. సంబంధిత అధికారుల సలహాలు సూచనలు కరువవుతున్నాయి. ప్రభుత్వం పలుమార్లు హెచ్చరిస్తున్న క్షేత్రస్థాయిలో మాత్రం అధికారుల పర్యవేక్షణ కనిపించడం లేదు. కొందరు రైతులు సాగు అనుభవంతోనే పురుగు మందులను విచ్చలవిడిగా కొనుగోలు చేస్తూ పిచికారి చేసుకుంటు నష్టపోతున్నారు. పంటలను ఆశిస్తున్న తెగుళ్లకు పిచికారి చేస్తున్న మందులకు ఎలాంటి సంబంధం లేకుండానే పోతుంది. స్థానికంగా అధికారులు అందుబాటులో లేకపోవడంతో ఫోన్‌లో సంప్రదిస్తున్నా.. స్పందించడం లేదంటున్నారు. నిత్యం పంటలను పరిశీలించి సలహాలు, సూచనలు చేయాల్సిన అధికారులు ఏవో సర్వేల పేరిట తప్పించుకుంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ప్రస్తుతం రైతు రుణమాఫీ, పంటల సాగు సర్వేను చేపడుతున్న అధికారులు రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు చేయడం లేదంటున్నారు. కొందరు అధికారులైతే క్షేత్రస్థాయి పరిశీలన పేరిట సొంత పనులకే పరిమితమవుతున్నారన్న ఆరోపణలు లేకపోలేదు. కొన్ని గ్రామాల్లోనైతే ఇప్పటికీ వ్యవసాయ శాఖాధికారి ఎవరో కూడా తెలియని పరిస్థితులు ఉన్నాయి. వ్యవసాయ శాఖలో పూర్తిస్థాయిలో అధికారుల నియమాకాలను చేపట్టిన ఆశించిన ప్రయోజనమే లేకుండా పోయిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



కఠినంగా వ్యవహరించాలి

: బొర్రన్న, రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు

నకిలీ విత్తనాలు, ఎరువుల విక్రయిస్తున్న వ్యాపారులపై కఠినంగా వ్యవహరించాలి. మట్కా, గుట్కాపై ఉక్కుపాదం మోపిన విధంగానే అధికారులు నకిలీ పురుగు మందులను అరికట్టాలి. జిల్లాలో నకిలీ బయోమందుల వాడకం విపరీతంగా పెరిగిపోతుంది. అధికారులు మాత్రం అడ్డుకునేందుకు చర్యలు తీసుకోవడం లేదు. అలాగే పురుగు మందుల వాడకం పై రైతుల్లో అవగాహన లేక నష్టపోతున్నారు. రైతువేదికలను నిర్మించిన సమావేశాలు నిర్వహించిన దాఖలాలే కనిపించడం లేదు. వ్యాపారులకు వ్యవసాయ శాఖ అధికారుల అండగా నిలవడంతోనే రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుంది.

రైతు ఫిర్యాదు చేసి.. వాపస్ తీసుకున్నాడు

: మహేందర్, ఏవో, తలమడుగు

నకిలీ పురుగు మందులను పిచికారి చేయడంతో పంట ఎండిపోయిందని ఫిర్యాదు చేసిన రైతు మళ్లీ ఫిర్యాదును వాపస్ తీసుకున్నాడు. దీంతో సంబంధిత వ్యాపారి పై చర్యలు తీసుకునేందుకు ఆస్కారం లేకుండా పోయింది. గత పది రోజుల క్రితం మండల కేంద్రంలోని ఓ ఫర్టిలైజర్ దుకాణంలో పురుగు మందులను కొనుగోలు చేసి పత్తి పంటపై పిచికారి చేయడం జరిగింది. దీంతో పత్తి పంట ఎండిపోయిందని రైతు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టాం. నకిలీ మందులను అరికట్టేందుకు అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నాం.

సంక్షిప్త సమాచారం



మాట్లాడుతున్న ఆదివాసీ నాయకులు

ఎమర్జెన్సీ టైంలో చట్టం ఎలా వచ్చింది? : సెడ్మకి

ఉట్నూర్, జూలై 31: దేశంలో 1975 జూన్ 25 నుంచి 1977 మార్చి 21 వరకు ఎమర్జెన్సీ ఉన్నప్పుడు లంబాడాలను ఎస్టీ జాబితాలో చేరుస్తూ పార్లమెంట్ ఎలా చట్టం చేసిందని ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా ప్రధాన కార్యదర్శి సెడ్మకి రామారావు ఆరోపించారు. బుధవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో వేలల్లో ఉన్న లంబాడా జనాభా లక్షల్లో ఎలా పెరిగిందో లంబాడా నాయకులు సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. చట్టానికి, జీవోకు తేడా లేకుండా మాట్లాడడం సరైనది కాదన్నారు. ఒకజీవో ద్వారా ఒక కులానికి తొలగించడం గాని చేర్పించడం గాని చెల్లదన్నారు. ఓటు బ్యాంకు కోసం ఆదివాసీ రాజకీయ నాయకుల ముసుగులో బతుకుతున్నారని, లంబాడాలు ఎస్టీలు కాదన్నారు. ఎస్టీ కమిషన్ వేయించి లంబాడాలు ఎస్టీలేనని ప్రకటించాలన్నారు. ఆదివాసీ రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు, మంత్రులకు తమ సమాజం మీద చిత్తశుద్ధి ఉంటే లంబాడాలు ఎస్టీ కాదని అసెంబ్లీలో మాట్లాడాలన్నారు. ఆదివాసీలకు జరుగుతున్న అన్యాయం మీద ఆదివాసీ ప్రజా ప్రతినిధులు నోరు విప్పాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వెడమ శేఖర్, అరకుమేష్, అర్క గోవిందరావు, వినోద్,మేస్రం హీరాలాల్, పెందూర్ గోవిందరావు, తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో రుణాలు చెల్లించాలి

నార్నూర్, జూలై 31: మండలకేంద్రంలో ఉన్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకి మాలోత్ రవీందర్ బాధ్యతలు స్వీకరించారు. భైంసా నుంచి నార్నూర్‌కి బదిలీ ఉత్తర్వులు వచ్చినా సందర్భంగా మాట్లాడుతూ ప్రాంత ప్రజలు బ్యాంకు సేవలు సద్వినియోగం చేసుకోవాలి అన్నారు. సకాలంలో రుణాలు చెల్లించాలి. ప్రజలు వ్యక్తిగత రుణాలు, క్రాప్‌లోన్ ఇతరత్రా అంశాల్లో ఎవరైనా మిమల్ని సంప్రదిస్తే అలాంటి వారి మాటలు విని మోసపోవద్దు పేర్కొన్నారు. మీకు ఎలాంటి సహాయం కావాలా అన్ని మీరు నేరుగా బ్యాంక్‌కి వచ్చి మాతో సంప్రదించాలని సూచించారు. వారి వెంట అధికారులు, గ్రామస్థులున్నారు.

విచ్చలవిడిగా మహారాష్ట్ర మద్యం అమ్మకాలు

బోథ్, జూలై 31: బోథ్ మండలం సరిహద్దుల్లో ఉన్న గుట్ట పక్క తండా ఘన్‌పూర్ గ్రామాల సరిహద్దుల్లో మహారాష్ట్ర మద్యం దేశీదారు విక్రయాలు జోరుగా కొనసాగుతున్నాయి. సోనాల గ్రామం సమీపంలోని పెట్రోల్ బంక్‌సమీపంలో కొంత మంది మహారాష్ట్ర మద్యాన్ని తీసుకువచ్చి విక్రయిస్తున్నారు. ఫలితంగా సాయంత్రం అయిందంటే మందుబాబుల కోలాహలం కనిపిస్తుంది. సాయంత్రం రోడ్లపై మందుబాబుల హంగామా చేయడంతో పాటు వారి వారి గ్రామాల్లో సైతం అల్లర్లకు పాల్పడుతున్నారు. సంబంధిత శాఖల అధికారులు మహారాష్ట్ర మద్యానికి కట్టడిచేయాల్సిన అవసరం ఉంది.



మొక్కలు నాటి నీళ్లు పోస్తున్న కలెక్టర్ రాజార్షిషా, అధికారులు



క్రీడా ప్రాంగణంలో డీఈవోతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా



విద్యార్థులను పరిచయం చేసుకుంటూ..

మహిళా శక్తితో సంఘాల బలోపేతం

● జిల్లా కలెక్టర్ రాజార్షిషా ● కలెక్టరేట్‌లో మహిళా శక్తి పథకం కార్యక్రమంపై సమీక్ష ● పాల్గొన్న అధికారులు, మహిళా సమాఖ్యల సభ్యులు

ఆదిలాబాద్ అర్బన్, జూలై 31: మహిళా శక్తి పథకం కార్యక్రమంపై కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఇందులో గ్రామీణాభివృద్ధి, సెర్ప్, లీడ్‌బ్యాంకు, పశు, స్త్రీనిధి, పరిశ్రమలు, విజయ డెయిరీ, తదితర శాఖల అధికారులు, జిల్లా సమాఖ్య మండల సమాఖ్యల ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ప్రణాళిక రూపకల్పన, అమలుపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళలను ఆర్థికంగా శక్తిమంతులను చేయడమే మహిళా శక్తి పథకం ముఖ్య ఉద్దేశమని అన్నారు. ఈ పథకాన్ని జిల్లాలో దిగ్విజయంగా నెరవేర్చాలని సూచించారు. స్వయం సహాయక సంఘాల ద్వారా పలు రకాల సూక్ష్మ పరిశ్రమలు, వ్యాపారాలను ప్రోత్సహించి సంఘాలలో సభ్యులుగా ఉన్న మహిళల ఆర్థిక స్వావలంభనకు సహకరించడం, మహిళల సామాజిక భద్రత కోణంలో సంఘాలను బలోపేతం చేయడం మహిళ శక్తి పథకం ప్రధాన ఉద్దేశాలన్నారు. సూక్ష్మ తరహా పరిశ్రమలను గుర్తించి, అందులో సంఘాలను ప్రోత్సహించడం, ఆయా సంఘాలలో మహిళలు తమ నైపుణ్యాలకు తగ్గ ఉత్పత్తులను ఎంచుకుని, ఆ ఉత్పత్తులకు అవసరమైన నైపుణ్యాన్ని అందించడం, ఉత్పత్తికి అవసరమైన ఆర్థిక సహకారం కోసం బ్యాంక్ లింకేజీల సదుపాయం, ఉత్పత్తి అయిన సరుకులు మార్కెటింగ్‌కు అవసరమైన ప్రణాళికలు, సహకారం అందివడం మహిళ శక్తి పథకంలో భాగమని తెలిపారు. ఇందులో ట్రైనీ కలెక్టర్ అభిగ్యాన్ మాలవియ, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సాయన్న, సంబంధిత శాఖల జిల్లా అధికారులు, జిల్లా మహిళ సమాఖ్య అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.

● వన మహోత్సవంలో మొక్కలు నాటిన కలెక్టర్

ఆదిలాబాద్ అర్బన్: ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా బుధవారం పట్టణంలోని గాంధీపార్కు, ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో జిల్లా కలెక్టర్ రాజార్షిషా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఒక్క రోజే వెయ్యి మొక్కలు నాటడం జరిగిందని తెలిపారు. గాంధీపార్కులో 600 మొక్కలు, స్టేడియంలో 400 మొక్కలు నాటే కార్యక్రమంలో మొత్తం వెయ్యి మొక్కలు నాటడం జరిగిందని పేర్కొన్నారు. మొక్కలు నాటడం కాకుండా వాటి సంరక్షణ జరగాలనన్నారు. ఇందులో మున్సిపల్ కమిషనర్, ఫారెస్టు అధికారి, జిల్లా యువజన క్రీడా అధికారి, డీపీఆర్వో, వివిధ కళాశాల నుంచి విద్యార్థిని, విద్యార్థులు యువత మొక్కలు నాటారు.

● క్రీడా పాఠశాల వసతిగృహం తనిఖీ

ఆదిలాబాద్ రూరల్: జిల్లాకేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని క్రీడా ప్రాంగణంలో ఉన్న క్రీడా పాఠశాల వసతి గృహాన్ని జిల్లా కలెక్టర్ రాజర్షి షా బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంటశాలను పరిశీలించి, మెనూ ప్రకారం పౌష్టికాహారం అందిస్తున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఉదయం వాకింగ్ ట్రాక్ వద్ద వాకర్లతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, తమకు క్రీడా సామగ్రి సమకూర్చాలని విద్యార్థులు కలెక్టర్‌కు విన్నవించడంతో క్రీడా పాఠశాలలో నెలకొన్న సమస్యలన్నీ పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల అధికారి వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ అజయ్, శిక్షకులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

● విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి

జైనథ్: జిల్లాలోని ఆయా గ్రామాల్లో పని చేస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్యాను అందించాలని జిల్లా కలెక్టర్ రాజార్షిషా అన్నారు. బుధవారం పీఎం పోన్ పథకం అతిథి బోజన్ పథకాన్ని మండలంలోని పిప్పర్‌వాడలో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అధికారులు నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజార్షిషా మాట్లాడుతూ ఆయా గ్రామా ల్లోని విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను క్రమం తప్పకుండా ప్రభుత్వ పాఠశాలలకు పంపాలనికోరారు. ప్రజలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని వాటి ద్వారా ఆర్థిక పరిపుష్టిని సాధించాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి పిల్లలు, గర్భిణుల హాజరు పట్టికను పరిశీలించి వారికి అందించే భోజన వివరాలను అడిగి తెలుసుకున్నారు. దీంతో పాటు విద్యార్థులు ఉపాధ్యాయులతో కలసి మధ్యాహ్న భోజనాన్ని ఆరగించారు. అదే విధంగా పిప్పర్‌వాడ గ్రామరైతులతో కలిసి రుణమాఫీ గురించి మాట్లాడారు. ఈ సందర్భంగా పిప్పర్‌వాడ గ్రామస్థులతో కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో గ్రామస్థుల భాగస్వామ్యం తప్పనిసరి అని అన్నారు. ఈ సందర్భంగా ఇంటింటా ఇన్నోవేటర్ పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పిప్పర్‌వాడ గ్రామస్థులు కలెక్టర్ రాజార్షిషాను పూలమాలలు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద జిల్లా విద్యా శాఖాధికారి టి.ప్రణీత్, సెక్టోరియల్ అధికారి నారాయణ, జైనథ్ మండల తహసీల్దార్ శ్యాంసుందర్, ఎంపీడీవో రవీంద్రనాథ్, ఎంఈఓ జి.శ్రీనివాస్, ఎంపీఈవో వెంకట్‌రాజ్, పిప్పర్‌వాడ హెచ్‌ఎం పద్మజ, జిల్లా సైన్స్‌ఫేర్ అధికారి రఘుమణలతో పాటు విద్యార్థులు ఉపాధ్యాయులు, పిప్పర్‌శాడ గ్రామప్రజలు పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో పాల్గొన్న ఆయా శాఖల అధికారులు

ఆదివాసీ దినోత్సవం జయప్రదం చేయాలి

● నిర్వహణ కమిటీ చైర్మన్ మంగం విషంరావు

ఉట్నూర్, జూలై 31: ఈనెల 9న మండలకేంద్రంలోని కుంరంభీమ్ ప్రాంగణం పీఎంఆర్సీ భవనంలో నిర్వహించనున్న ప్రపంచ ఆదివాసీ దినోత్సవంను విజయవంతం చేయాలని ప్రపంచ ఆదివాసీ దినోత్సవం నిర్వహణ కమిటీ చైర్మన్ మంగం విషంరావు తెలిపారు. ఆగస్టు 9న ఉట్నూర్‌లో నిర్వహించుటకు గోండు, పరధ్ధన్, తోటి, కోలాం, నాయక్‌పోడ్, అంద్ తెగల నాయకులు రాయ్‌సెంటర్ జిల్లా మెడిమేస్రం దుర్గు అధ్యక్షతన సమావేశం నిర్వహించుటకు నిర్ణయించడం జరిగిందన్నారు. ఈ మేరకు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిని కలిసి ప్రపంచ ఆదివాసీ దినోత్సవానికి రావాలని బుధవారం ఆహ్వానించామన్నారు.ప్రపంచ ఆదివాసీ దినోత్సవం నిర్వహణ కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.అలాగే ప్రతీ గ్రామం, మండల, జిల్లా కేంద్రాలలో ఆదివాసీ సంస్కృతి సాంప్రదాయాలు ప్రకారం జెండాలు ఆవిష్కరించి అందరు ఉట్నూర్ కుంరంభీము కాంప్లెక్స్ పీఎంఆర్సీకి తరలి రావాలని నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు.ప్రపంచా ఆదివాసీ దినోత్సవం ఆగస్టు9న సంస్కృతీ, సంప్రదాయాలను ప్రతిబింబించే విధంగా ఘనంగా నిర్వహించుటకు నిర్ణయం చేయడం జరిగిందని నిర్వాహణ కమిటీ చైర్మన్ మంగం విషంరావు, జిల్లా మేడి మేస్రం దుర్గులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రాయిసెంటర్ గౌరవ అధ్యక్షులు కుమ్రవిఠల్‌రావు, వైస్ చైర్మన్ గేడం నీరంజన్, ప్రధాన కార్యదర్శి పురుక బాపురావు, కనక ప్రభాకర్, కార్యదర్శి టేకం భీమ్‌రావు, కార్యదర్శి ఆత్రం పరమేశ్వర్, ప్రచార కార్యదర్శి ఆడ హన్మంతురావు, నిర్వహణ కార్యదర్శి మడావి బాలాజి, ప్రచార కార్యదర్శి మరప పురుషోత్తం, సంస్కృతి కార్యదర్శి గోడం ఆశీష్, సంస్కృతి కార్యదర్శి డాక్టర్ జనార్ధన్, ప్రచార కార్యదర్శి సిడాంశేషు, ప్రచార కార్యదర్శి సిడాం బాపురావు, ముఖ్య సలహాదారులు పెందూర్ ప్రభాకర్, సార్‌మేడి ఆత్రం భగవాన్‌షా, బొంతాశారెడ్డి, కొడప రాదాబాయి, కుమ్ర బాగుబాయి, ఆర్క వసంతరావు, పేసా కోఆర్డినేటర్, తొడసం దేవేరావు, తొడసం మారుతిలు పాల్గొన్నారు.



ఐటీడీఏ పీవోను ఆహ్వానిస్తున్న నిర్వహణ కమిటీ చైర్మన్, సభ్యులు

బాధితుల వద్దకే వచ్చి.. వివరాల సేకరణ

ఆదిలాబాద్, జూలై 31(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లా కోర్టులో ఓ కేసు విచారణలో భాగంగా ప్రొటక్షన్ ఆఫ్ సివిల్ రైట్స్ (పీసీఆర్)కోర్టు న్యాయాధికారి టి.దుర్గారాణి బుధవారం కోర్టు బయట ఉన్న సాక్షుల వద్దకు స్వయంగా వచ్చి వివరాలను సేకరించి సాక్షాధారాలను నమోదు చేయడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. వివరాల్లోకి వెళ్తే.. 2017లో తలమడుగు మండలం జామిడి గ్రామానికి చెందిన మునేశ్వర్ రాంబాయి, భగవత్ సులోచనలు తలమడుగు పోలీసు స్టేషన్‌లో కె.ఊశన్న, ఐయిండ్ల సక్కుబాయిలపై ఫిర్యాదు చేయడం జరిగింది. ఈ కేసు విచారణలో భాగంగా ఇద్దరు బాధితుల సాక్షాన్ని నమోదు చేయాల్సి ఉండగా.. వారు నడవలేని స్థితిలో తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నారు. దీనిని గమనించిన న్యాయాధికారి బాధితులను కోర్టు ఆవరణలోకి తీసుకొచ్చిన ఆటో వద్దకు వెళ్లి ఏపీపీ ఎం.నవీన్, న్యాయవాది ఎ.అమరేందర్‌రెడ్డిల సమక్షంలో సాక్షాధారాలను నమోదు చేసినట్లు కోర్టు లైజన్ ఆఫీసర్ ఎం.ధన్‌రాజ్‌సింగ్ తెలిపారు.



ఆటోలో వచ్చిన బాధితుల నుంచి వివరాలను సేకరిస్తున్న న్యాయాధికారి